కథానిక

# అందరికీ ఇళ్ళు

"వనశ్రీ"

ఎముకలు కొరికేస్తోంది చలి. తాలూకాఫీసులో పన్నెండు గంటలు కొట్టారు, గాంధీనగర్ వీధిలో మునిసిపాలిటీ దీపాలు మినుకుమినుకు మంటున్నాయి. తెల్లటిమంచు తెరలు తెరలుగా తారురోడ్డుమీదపడుతోంది. అంతవరకు అరుస్తూ తిరిగిన వీధికుక్కలు గోడమూలలకుచేరి ముడుచుకుని పడుకున్నాయి శ్రీవారి యింటిముందు. మురుక్కాలవలో అంతవరకూ బరబరా శబ్దంచేస్తూ తిరుగుతోన్న పందికొక్కు వొకటి కుక్కలు సద్దుమణిగి పడుకోటంచూసి, ఎగిరి శ్రీవారి భవనం ముందున్న అరుగుమీదకు దూకింది.

కీనీడలో అరుగుమీదముడుచుకుపోయిన రెండు నల్లటి ఆకారాలు అదిరిపడి కదిలినయ్! "అమ్మో" అంటూ తత్తరపాటుతో కూడిన కేక! దానివెనకే గుర్రూ, బుసగొట్టడం వినిపిస్తోంది. ఆ ఆకారాల్లోంచి వెలువడుతూన్న బాధ, మూలుగూ చలిగాలిలో నిండిపోయి ఆ వాతావరణాన్ని నింపేస్తూన్నాయి. ఆ బాధా, ఆ మూలుగుధ్వనీ ఏ జంతువు తాలూకుదీకాదు. ప్రకృతినీ, చలినీ జయించిన మానవుడి భాషలోనే ఆ బాధ వెలురించబడుతోంది. మానవుడు నిరాయుధుడై ప్రకృతిని ఎదిరిస్తోన్నాడు! మానవుడి నగ్నశరీరం, కొరికేస్తూన్న చలిగాలితో ఘర్షణ పడుతోంది!

ఆ బాధను జంతువులు కూడా అనుభవించి వుండవు. ఊపిరిపీల్చటానికి మనిషి పడుతూన్న శ్రమా, బాధా అది!

శ్రీవారి మేడముందు గదిలో లైటు వెలిగింది. మూసివున్న కిటికీసందుల్లోంచి సన్నగా వెలుతురు బైటవున్న అరుగుమీద పడింది. అరుగుమీద అర్థనగ్నంగా ఓ ముసలాడు, అతని కడుపు కరుచుకొని ఓ కుర్రాడూ, చలికి గజగజావణుకుతూన్నారు. వాళ్ళు కూర్చున్నారనికానీ పడుకున్నారనిగానీ చెప్పడంకష్టం. ఆరెంటికీవున్న మధ్యస్థితిలో గోడకానుకొని ముడుచుకొని వున్నారు.

"ఒరేయ్! సి-సిన్నోడా! యిటొచ్చి యీపు కానుకోరా?" ముసలాడు ఎగశ్వాస దిగశ్వాసతో మాట తేలిపోతూ అన్నాడు.

"అబ్బ వుండయ్యా! నాకు సలేత్తాంటేను" రెండు చేతుల్తో చొక్కాలేని రొమ్ముకప్పుకుంటూ తండ్రిపడిలో ముడుచుకొని అన్నాడు సిన్నోడు.

"న్నాయన్నాయనగా! నా పేణంపోతందిరా! యెన్న యింగవేసుకొత్తాంది-" మాట పూర్తి చేయకముందే ముసలాడు ఖంగుఖంగున దగ్గుతూ వుక్కిరిబిక్కిరయిపోయాడు. అలావచ్చినదగ్గు తెర ఐదునిమిషాలపాటు ముసలాడిని మెలికలు తిప్పేసింది. ముసలాడు చేతులు ముందుకానించి నోరుతెరచి బలవంతంగా గాలిపీలుస్తోన్నాడు. ఒకటే గురగురధ్వని. యాడమ్స్ఏపుల్ మగ్గం లోనికండెలాగా కిందకీపైకీ వూగిపోతోంది! పక్కయెముకలు కిందకీపైకీ బాగోతమాడిపోతున్నాయ్! లోతుకుపోయిన కనిగుంటల్లోని కళ్ళలో ఎర్రటి జీరలుకదిలాయి.

తోలుసంచిలోపెట్టి కుట్టిన అస్థిపంజరంలా ముసలాడు ఆకటి బాధకూ, వ్యాధికీ కృశించి శుష్కించిపోయివున్నాడు. మొలచుట్టూ వో రెండుమూరల మురికి పాతగుడ్డతప్ప శరీరంపై యింకేమీలేదు. దుమ్మూ మంచుతో తడిచిన దల అడచలుకట్టుకుపోయివుంది. ముడుతలు పడిపోయిన శరీరం మడతల్లో మురికి పేరుకుపోయి వుంది.

"ఓరేయ్ సిన్నోడా! నీకేరాసెప్పేది. పాణం ఎగరేసుకుపోతోందిరా అయ్యో! వుహుహూ! ఆయ్యో!"

కుర్రాడు దిగాలుగాలేచి జారిపోయిన-గుండీలు లేని లాగును పైకిలాక్కొని ముడివేసుకొని తండ్రి వెనక్కుపోయి వీపుకి ఆనుకొన్నాడు.

"అదేందయ్యా! యియ్యాల పిల్లిలాగా అరుత్తున్నావ్? అట్టా అరుత్తాంటే నాకు బయమే

తుంది!" నిదరమత్తులో వున్న వాడి శరీరానికి చలిగాలితగిలి మత్తువదిలిపోయి భయంగా అన్నాడు.

"అదిగదేరా నాయనా! యీ యాదికున్న లచ్చణమే అదిరా? పిల్లికూతలు!" మాట పూర్తి కాకముందే మళ్ళీ దగ్గుతెరవచ్చిపడింది. వూపిరితిత్తులు పగుల్తవా అన్నంతగా దగ్గు!

కొంచం దగ్గు సర్దుకోగానే కుర్రోడు అన్నాడు తండ్రి పక్కలు నిమురుతూ - "నిన్న పెద్దాసుపెటలు డాకటేరుకు సూపిచ్చావుగదే మరి!"

"ఆఁ యేం సూపిచ్చటకేరా? ఆఁ యిట్టాగే బాధ పళ్ళేక ఆ పెబువులదగ్గరికిపోతే, రోజంతా నిల్సోబెట్టి కాసిని ఎర్రనీళ్లు పోత్తారు. దానికేం యీయాది కుదుర్తా? సత్తదా? అక్కడికీ నిన్న అడిగేశా! డాక్టరుగోర్ని అడిగేశా యీ యాది యవారమేందో అసలు చెప్పమని" ఖాండ్రించి వూసి గొంత సవరించుకొని ముసలాడు మళ్ళీ మొదలుపెట్టాడు. చలికి కొంకర్లు పోతోన్న చేతుల్తో తండ్రిని అనుకొని చిన్నోడు మౌనంగా వింటున్నాడు. తండ్రి అవస్థ చూస్తూన్నవాడి చిట్టి బుర్రకు చలి బాధ తెలియనట్టుగా వుంది!

"ఏందో బొద్దెంకీసో; భోంకీటీసో అన్నాడు; మందు సీటీ రాసిచ్చాడు; వోటరు బరీసో ఏందో మరి!"

కుర్రాడి చిన్న బుర్రలో పెద్దపెద్ద ఆలోచనలు తిరిగిపోతూన్నాయి! కళ్ళుమూసి కళ్ళు తెరిచేసరికి తను డాక్టరు అయిపోతే అయ్య జబ్బంతా వుఫ్‌మని మాయం చేసేస్తాడు!

"ఆమందు సీసా ఆసుపత్రిలో యియ్యరంట! బయటిసాపులో కొనుక్కోవాలంటరా!" ముసలాడు జాలిగా అన్నాడు.

"అది కొనుక్కుంటే నయమవుద్దా అయ్యా?" అమాయకంగా అన్నాడు సిన్నాడు.

"ఎంత పిచ్చోడివిరా సిన్నోడా? అది ఏడు రూపాయ లవుద్దంట! ఏడు రూపాయలు కాదు గదా ఏడు దమ్మిడీలు కూడా లేవుగదరా మన దగ్గర! ఏడు జన్మాలెత్తినా మనబోటోళ్ళకు దొరకుద్దిరా ఆ మందు!" ముసలాడు వ్యాధి తీవ్రతలో వున్నాడో ఏమో రొప్పుకొంటూనే అన్నాడు.

కుర్రాడి మనసులో వూహాలు విహంగాల్లా రెక్కలు విప్పుకొంటూన్నాయి. తనకు తెల్లారి పాటికి ఓ సంచినిండా రూపాయలు దొరికితే అయ్యకు ఓ పది మందుసీసాలు కొని తీసుకొస్తాడు. తనకు ఎన్నిసార్లు దొరకలేదు అట్టా రూపాయలు రాసులకు రాసులు నిద్రలో! నిజంగా వోసారి అట్టా దొరికితే? లేకపోతే బుల్లోడి మాదిరిగా—ఆఁ వాడు కొట్టేసిన మనిపర్సులో అబ్బో! ఎన్నిరూపాయలున్నయ్? తనూ అట్టాగే ఎక్కడన్నా ఒక పర్సు—

"ఏడు రూపాయలు పెట్టి మందులు కొనే శక్తియేవుంటే యిట్టాంటి మాయదారి జబ్బెందుకొస్తుందిరా? యేళకు గంజితాగినంత కాలం యిట్టాంటిదేంటో ఎరుగుదు నంటావా? మరీ దీం సిగతరగ చలికాలం వత్తేసరి పాణం మీదికొత్తది! పోయి నేడాదిలో యింత అవత్తగా లేదురా నాయనా? మొకులాంటి దుప్పటున్నావుండేది! పైగా ఆ సత్రవలో కాస్త ఎచ్చగా వుండేది. మారాజు యీ సంవత్సరం సత్రవ మూసేసి కొట్టు కట్టించుకొన్నాడు రోజూ పడుకునే లైబ్రిముందేమో రేపు నాయకుడివిమాటింగు సెప్పతాడంట! అందుకని ఆడ పందిళ్లువిస్తూ మామూలుగా పడుకొనే జనాన్ని యెల్లగొట్టారు."—సగంబయటకూ, సగంలోపలా గొనుక్కుంటూన్న ముసలాడికి మళ్ళీ దగ్గుతెర తోసుకు వచ్చింది.

తాలూకాఫీసులో వొంటిగంట కొట్టారు. మంచు దట్టంగా పడుతోంది. చలిగాలి మంచును తోసుకొని వీస్తూంది!

ముసలాడి శరీరంలో రక్తం చలికి గడ్డకట్టుకు పోతూంది. దగ్గిదగ్గి బోర్లాపడ్డాడు. బరువుగా గాలిపీలుస్తూ గుడ్లుతేలవేశాడు.

రెక్కలుతెగినపక్షిలా మెలికలుతిరిగిపోతూన్న తండ్రిశరీరాన్ని గుండెలకు హత్తుకొని చిన్నోడు "అయ్యా! అయ్యా!"అంటూ పిచ్చిగా పిలిచాడు. గడగడా వణుకుతూ వెర్రిచూపులు చూపుల్తో కొడుకుకు చూస్తూ ముసలాడు నోటమాటరాక జాలిగా ఏడ్చాడు.

చిన్నోడి రక్తంలో ఏవో తెలియని శక్తులు ప్రవహించాయి. తనవంటిమీనున్న లాగుతీసి తండ్రిపై కప్పి చుట్టుపక్కల కలయచూశాడు. శ్రీవారి భవనం వాకిలిచూడగానే వాడితల్లో ఒక ఆశ

మెరుపులా మెరిసింది! వాకిలికి కట్టివున్న కర్టన్‌పై వాడిదృష్టి పడింది. తలుపుసందుల్లోంచి పడుతోన్న బెడ్‌రూమ్‌లైట్ కాంతి మూడురంగులు తెరగుడ్డపై ప్రాకిపోతూంది. విసురుగా వీస్తోన్న చలిగాలికి బలువుగా కదులుతోన్న కర్టన్‌పై రంగులు చెదిరిపోతూన్నాయి.

చిన్నోడు వొక్కదారులో యినపగేటు దూకి వాకిలిదగ్గరకుపోయి కర్టెన్ వొక్కగుంజుగుంజాడు. పైతాడు పటపటాతెగి కర్టెన్ చేతిలోకివచ్చింది.

ఒకచేత్తో గుడ్డ రొమ్ముకు హత్తుకొని పరుగెత్తుకుంటూవచ్చి మళ్ళీ యినపగేటు దూకబోతూండగా శ్రీవారి జోనంగి భౌమంటూ ఎక్కడ్నుంచో గాని వచ్చిపడింది. గేటుమీదికి ఎక్కిన చిన్నోడి ఓ కాలు గేటులోపల రెండోది గేటువెలుపల వుండిపోయింది. ఓ చేత్తో యినపకమ్మీలు పట్టుకొని, గేటుదూకే హడావుడిలో రెండోచేతిలో వున్న కర్టెన్‌గుడ్డ కొంత కిందకు జారింది. జారిన కొసలంకించుకొంది శ్రీవారి కుక్క.

గేటుబయట చిన్నోడూ, లోపల కుక్కా చెరోవైపూ మూడురంగుల తెరను పట్టుకొని పెనగులాడారు. అంతలో శ్రీవారి భవనం తలుపులు తెరుచుకొన్నై! శ్రీరావుగారు బయటికొచ్చారు. గేటుబయట పోలీస్‌కారు ఆగింది.

తాలుకాలో రెండుగంటలుగొట్టారు. మంచు యింకొంచెం దట్టంగా పడసాగింది - తెల్లగా అదంతా మాపి తెల్లమొగమేసినట్టు! చలిగాలి మూలుగుతూ బరువుగా వీచింది. మిగిలినరాత్రి చిన్నోడికీ, ముసలాడికీ సబ్‌జైల్లో కొంచెం వెచ్చగా గడిచింది.

* * *

రెండోరోజు రాత్రి సబ్‌జైల్లో తండ్రీ కొడుకున్న గదిలోకి మునిసిపాలిటీ చెత్తబండి తోలే రామయ్య కూడా తోడుగా వచ్చాడు. ముసలాడూ, రామయ్యతండ్రీ ఒకే వూరునుంచివచ్చారు పట్నంలో పని చేసుకుందామని.

"ఏఁవేందిరా? రామయ్! నువ్వేం చేశావురా" అన్నాడు ముసలాడు ఆదుర్దాతో ఆశ్చర్యంగా.

"నేనేం చేయలేదత! నిన్న లైబ్రరీకాడ మీటింగు జరుగుతూంటే పోయాను. మీటింగులో రావుగారు అయిదు సంవత్సరాల తర్వాత అందరికీ కూడూ గుడ్డా వుంటుందని సెపుతుంటే నేనులేచి 'మరి యిళ్ళమాటో?' అన్నా. అడనుంచి జనం తలోమూలనుంచి లేచారు. అంతలోకి పోలీసోరు నన్ను లంకించుకుని మీటింగులో అల్లరి చేశానని జైలుకు లాక్కొచ్చారెస! ఇదేం న్యాయమో నువ్వే చెప్పవే?"

అంతవరకూ జైలు చల్లరాతి గోడల్నూ, గేటు యినప సువ్వల్నూ చూస్తోన్న చిన్నోడు—

"అందుకనియీయిల్లు నీకిచ్చారా?" అన్నాడు అమాయకంగా.

"ఆయ్యోయ్! యీడనుంచి మనన్నిపంపేస్తే యీసారి మీటింగులో మనం గూడా యిల్లియ్యమని అడుగుదామే?" చిన్నోడుకళ్లు పెద్దవైనయ్. కళ్ళనిండా సంతోషం. తెలియని కోర్కెల ఆనందం!

అంతవరకూ రామయ్య చెప్తూంది నోరు తెరుచుకు వింటూన్న ముసలాడు చిన్నోడివంక చూసి నోరు మరింత పెద్దగా తెరిచాడు అయోమయంగా. తాలూకాలో 12 గంటలు కొట్టారు. బయట చలిగాలి, సన్నగా మంచు పడుతోంది.

"అవును! యాళకింత గంజినీళ్ళు చలికాలం పెట్టెలా నాలుగ్గోడలూ కప్పూవున్న గదీ, కప్పుకోటానికీ గొంగళీ యిమ్మన్యాల సుమారుగా వుంది దగ్గుకూడా" ముసలాడి అయోమయంగా వున్న మనసులో ఆలోచన ఆలాపనగా సాగిపోయింది.

* * *

తెల్లవారి దినపత్రికలో "పంచవర్ష ప్రణాళికలో అందరికీ యిళ్ళు!" అన్న శీర్షికతో శ్రీరావుగారి అనర్గళ ఉపన్యాసం అద్వితీయంగా అమోఘంగా ఐదున్నరకాలమ్సు ప్రకటించబడింది.

---

ఒక రకంగా చూస్తే అపవాదులు దొంగనాణేలవంటివి. చాలామంది వాటిని సృష్టించే పాపానికి ఒడిగట్టరుగాని— ఆలోచనారహితంగా ప్రచారం చేసేస్తూంటారు. —ఎర్నెస్ట్ రెనాన్